విశాలాంధ్ర కృష్ణా జిల్లా

అర్ధ సంవత్సర పరీక్షలు...

విశాలాంధ్ర, కూచిపూడి: ఎస్ఏ-1 (అర్థ సంవత్సరం) పరీక్షలు ఈనెల 10వ తేదీ వరకు జరుగుతాయని విద్యాశాఖ తెలిపింది. కూచిపూడి, పెదముత్తేవి సంస్కృత పాఠశాలలో సోమ, మంగళవారాల్లో జరిగిన పరీక్షల్లో 230 మంది పాల్గొన్నారని హెచ్ఎం అన్నే లక్ష్మి కుమారి (కూచిపూడి), ఐ. రత్నకుమారి (పెదముత్తేవి) వివరించారు. మండలంలో 71 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 5,650 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని ఎంఈఓ నారే పాలెం శివ శంకరరావు తెలిపారు. ప్రశ్నాపత్రాలు ఎంఈవో కార్యాలయంలో భద్రపరిచినట్లు వివరించారు.

'సంజీవిని'లో గర్భిణులకు ఉచిత ప్రసూతి సేవలు

విశాలాంధ్ర, కూచిపూడి: రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయంలో గర్భిణీలకు ఉచిత ప్రసూతి సేవలు అందించనున్నామని సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు, సంజీవిని వైద్యాలయ వ్యవస్థాపకులు కూచిభొట్ల ఆనంద్ మంగళవారం తెలిపారు. ఫిబ్రవరి 28వ తారీకు లోగా పేరు నమోదు చేయించుకున్న 365 మంది గర్భిణీ స్త్రీలకు మాత్రమే సౌకర్యం కల్పిస్తున్నట్టు చెప్పారు. డోర్ టు డోర్ క్యాంపైన్ నిర్వహించి అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. మందులు, స్కానింగ్ ఖర్చులు గర్భిణులు చెల్లించాలన్నారు. వివరాలకు 08671-251251, 9121901919, 9121902929 సంప్రదించాలన్నారు. ఏ.ఓ. జొన్నలగడ్డ హనుమకుమార్, నిమ్మగడ్డ సత్య ప్రకాష్ పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర, కూచిపూడి: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాలలోని అంగన్వాడి కేంద్రాలలో ఖాళీల భర్తీకి ఈనెల 12 లోగా దరఖాస్తులు అందజేయాలని సిడిపిఓ పి భానుమతి మంగళ వారం కోరారు. కొండవరంలో (జనరల్) పోస్టు 1, మొవ్వ-4, గూడపాడు-1, పెదముత్తేవి-3, చల్లపల్లి-7, హెల్పర్ పోస్టులు జనరల్ కేటగిరీకి, ఘంటసాల మండలంలో కొడాలి-3 కేంద్రం ఎస్సీ కేటగిరి సహాయకురాలుఖాళీగా ఉన్నాయ న్నారు. దరఖాస్తులను ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

విశాలాంధ్ర, కూచిపూడి: రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తహసీల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ సిబ్బదిని ఆదేశించారు. మొవ్వ పిఏసిఎస్ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మార్గదర్శకాలను వెల్లడించారు. ప్రభుత్వం 10 శాతం వరకు రంగు మారిన ధాన్యం రైతు భరోసా కేంద్రాలద్వారా కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చిందని సూచించారు.

పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-కోడూరు: ఒకటో వార్డులో మంగళవారం నూతనంగా మంజూరైన వృద్ధాప్య పింఛన్‌లను ఎమ్.పి.టి.సి. బడే గంగాధర్ లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 7384 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టుచెప్పారు. నూతనంగా 310 మందికి నూతనంగా పింఛన్లు మంజూరైనట్టు వెల్లడించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

విశాలాంధ్ర, పెదపారుపూడి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 21 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు, 10వ తరగతి చదువుతున్న 54 మందికి స్ఫూర్తి స్టడీ మెటీరియల్ ను మంగళవారం వైస్ ఎంపీపీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఎన్ ఎం ఎం ఎస్ పోటీ పరీక్షలకు హాజరవుతున్న ఆరుగురికి యుటిఎఫ్ ద్వారా స్టడీ మెటీరియల్ అందజేసినట్లు హెచ్. ఎం. రావెళ్ల వరుణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.పాఠశాల కమిటీ చైర్మన్ జి. హరి ఓం ప్రసాద్, ఉపాధ్యాయులు వి. పద్మావతి, పి.సత్యనారాయణ, వి. సాంబశివరావు, డిఎస్. మల్లేశ్వరరావు, పి. అంబేద్కర్, ఎస్. కరుణ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సమాధుల దొడ్డికి గోడ కట్టించాలి

విశాలాంధ్ర - గుడివాడ : ఒకటో వార్డులోని క్రైస్తవ సమాధులదొడ్డిని అక్రమించిన వారిని తొలగించి గోడ నిర్మించాలని హ్యూమన్‌రైట్స్ ఛీఫ్ సింగవరపు జోషఫ్ ఆర్‌డివో పద్మవతికి మంగళవారం విన్నతి పత్రాన్ని అందజేశారు. చంద్రయ్య డ్రైయిన్ పకన ఉన్న క్రైస్తవ సమాధుల దొడ్డి మూడు వంతలపైనే ఆక్రమణకు గురియైందన్నారు. గుడివాడ రూరల్ మండలంలోని శేరీగొల్లేపల్లిలో ఇదే పరిస్థితి ఉందని, వెంటనే ప్రభుత్వం ప్రకటించిన విధంగా రక్షణ గోడ నిర్మించాలని కోరారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

విశాలాంధ్ర - గుడివాడ : స్థానిక షాగులబ్ చండ్ ప్రధమశ్రేణి శాఖ గ్రంథాలయంలో సావిత్రిబాయి పూలే 192వ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారి బి.వెంకటరమణ, తెలుగు భాషా వికాస పరిషత్ సమన్వయ కర్త డిఆర్‌బి ప్రసాద్, సిబ్బందితో కలసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పాఠకులు శ్రీనివాస్, నాగరాజు, రవితేజ, భాను, రామకృష్ణ, మాధిరి, సుసన్న, సిబ్బంది ప్రవళిక, క్రాంతి పాల్గొన్నారు.

వేదవ్యాస్‌కు బుద్ధప్రసాద్ పరామర్శ

విశాలాంధ్ర- అవనిగడ్డ : అసెంబ్లీ మాజీ ఉపసభాపతులు, టిడిపి నాయకులు బూరగడ్డ వేదవ్యాస్, మండలి బుద్ధప్రసాద్ మంగళవారం విజయవాడలో భేటీ అయ్యారు. వేదవ్యాస్ ఇటీవల సర్జరీ చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో బుద్ధ ప్రసాద్ ఆయనను పరామర్శించారు. జిల్లా రాజకీయంపై కూడా వీరిద్దరూ కొద్దిసేపు చర్చించుకున్నట్లు తెలిసింది.

CHANGE OF NAME

I, **MIMUNNISA** (old Name)
w/o. Mohammed Saheb,
R/o.4-95, Indira Nagar-1,
Penamaluru, Yanamalakuduru,
Krishna, AP - 520007
Have Change My Name to
MOHAMMED MIMUNNISA
(New Name)
Here after My Name is known as **MOHAMMED MIMUNNISA**

రంగుమారిన ప్రతి గింజ కొనుగోలు చేస్తాం

మంత్రి జోగి రమేష్

విశాలాంధ్ర, మచిలీపట్నం : జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రంగు మారిన ధాన్యం కొనుగోళ్లు, రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖా మంత్రి జోగి రమేష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ స్పందన మీటింగ్ హాల్లో మంగళవారం శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సివిల్ సప్లయ్స్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ఏడాది ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధతో ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా నిర్వహించారని తెలిపారు. ఎమ్మెల్యేలు ప్రస్తావించిన సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం క్వింటా రూ.2,060 మద్దతు ధర ఇస్తున్నదని, రంగు మారిన ధాన్యం కొంటామని రైతుకు భరోసా కల్పించాలన్నారు. మిల్లర్లను కంట్రోల్ చేయాలని అన్నారు.

కలెక్టర్ సి.రంజిత్ బాషా మాట్లాడుతూ, ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలు అందుబాటులో ఉంచాలని తహసీల్దార్ లకు సూచించారు. రంగుమారిన, పాడైన ధాన్యం కొనుగోలుకు నిబంధనలు పాటించాలన్నారు. 5 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం సేకరణ చేయాలన్నారు. రంగుమారిన ధాన్యం మరో లక్ష మెట్రిక్ టన్నుల వరకు ఉండవచ్చని అన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో రూ. 43,672 కోట్ల విలువైన 2,13,944 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు వివరించారు. రైతులకు రూ.300 కోట్ల వరకు చెల్లించినట్టు తెలిపారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనీల్ కుమార్ మాట్లాడుతూ ధాన్యానికి మద్దతు ధర కల్పించి చివరి గింజ వరకు కొనాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ, ధాన్యం రవాణాకు వాహనాలు అందుబాటులో ఉండటం లేదని, ఆర్బీకేలో తేమశాతం నమోదు చేసినప్పుడు రైతుకు మెసేజ్ వెళ్లేలా చూడాలన్నారు. జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్, ఆర్డీఓలు ఐ.కిషోర్ బందరు, పద్మావతి గుడివాడ, విజయకుమార్-ఉయ్యూరు. సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్ శ్రీధర్, డిఎస్ఓ వి.పార్వతి, డిసెఓ వి.వి.ఫణికుమార్, ఏడీ: మార్కెటింగ్ ఎల్,నిత్యానందం, జిల్లా వ్యవసాయశాఖాధికారి మనోహరరావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై దృష్టి పెట్టాలి: నాని

బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) మాట్లాడుతూ, తుపానుకు రంగుమారి దెబ్బతిన్న ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సొసైటీలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సరిగా నిర్వహించకపోతే మహిళా సంఘాలకు అప్పగించడం జరుగుతుందన్నారు. తూకంలో తేడాలు, రవాణా, గోనె సంచుల కొరత తదితర సమస్యలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. మిల్లుల వద్ద కస్టోడియన్ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని, తప్పనిసరిగా మిల్లు వద్ద ఉండి విధులు సరిగా నిర్వర్తించేలా చూడాలన్నారు.

కాపులను విస్మరిస్తే మూల్యం తప్పదు: కొట్టే

విశాలాంధ్ర, మచిలీపట్నం: కాపులను విస్మరిస్తున్న ఏ ప్రభుత్వం అయినా పతనంకాక తప్పదని కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కొట్టే వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక రేవతి హాల్ సెంటర్లోని వీఎం రంగా విగ్రహం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాపులను రాజకీయంగా ఎదగనీయకుండా ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని, కాపు కార్పొరేషన్ ద్వారా లోన్లు ఇవ్వడం లేదనీ,, విద్యార్థుల విదేశీ విద్యా పథకాన్ని అటకెక్కిచ్చిందని దుయ్యబట్టారు. జిల్లాల విభజన తరుణంలో ఏదో ఓ జిల్లాకు రంగా పేరు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టనట్లుగా వ్యవహరించడం దారుణం అన్నారు. కాపులను అనగదొక్కాలని చూస్తున్న ఏ ప్రభుత్వమైనా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని, కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప ఏ ప్రభుత్వం వల్ల కాపులకు ఒరిగిందేమీ లేదని ఆయన దుయ్యబట్టారు.

లంకిశెట్టి నీరజ మాట్లాడుతూ, హరిరామ జోగయ్య చేస్తున్న నిరాహారదీక్షకు మద్దతుగా బందర్ లో కొట్టే వెంకట్రావు చేస్తుంటే పోలీసులు చేస్తున్న ఓవరాక్షన్ ప్రజలందరూ గమనిస్తున్నారని, రిజర్వేషన్లు సాధించేంతవరకు మా పోరాటాల ఆపమని ఆమె అన్నారు. రాధా రంగ మిత్ర మండల జిల్లా నాయకులు బుల్లెట్ ధర్మారావు, కాపు నాయకురాలు ఓరుదు రమాదేవి, రేపల్లె పండు, వాలిశెట్టి సుధాకర్, మటే వెంకటేశ్వరరావు, కే సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త

సావిత్రిబాయ్ పూలే

విశాలాంధ్ర, మచిలీపట్నం: భారత దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయరాలు ,సమాజంలో కులతత్వం ,పురుషాధిక్యత పై 18 శతాబ్దంలోనే పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయ్ పూలే అని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం సావిత్రిబాయ్ జయంతిని నిర్వహించారు. సావిత్రిబాయి ఆధునిక భారతదేశంలో మొట్టమొ దటి మహిళా ఉపాధ్యాయురాలు అన్నారు. సామాజిక విప్లవ మాతృమూర్తి సావిత్రిబాయి అని ఆయన పేర్కొన్నారు

బీసీ సంక్షేమ కార్యాలయం...

స్థానిక ఈడేపల్లి బీ.సీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సావిత్రిబాయ్ పూలే జయంతి నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు శేకుబోయిన సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే సంఘసంస్కర్త, సామాజిక విప్లవకారిణి, రచయిత్రి, మహిళా ఉపాధ్యయినిగా ఎనలేని సేవలందించారని కొనియాడారు. కోమటి శ్రీనివాస్, జోగి శివ, ధనికొండ చిన్ని, జన్ను గోవిందరాజులు, పోలగాని వెంకటేశ్వర రావు, పుట్టి రాజశేఖర్, ఎం పి పవన్ పాల్గొన్నారు.

ఛాందసాలను ఎదిరించి...

విశాలాంధ్ర, గుడ్లవల్లేరు : భారతదేశంలో ఛాందస భావాలను ధైర్యంగా ఎదురొడ్డి నిలిచిన తొలి దళిత ఉపాధ్యాయురాలిగా సావిత్రి బాయిపూలే చరిత్రలో నిలిచారని కృష్ణాజిల్లా రైతు సంఘం నాయకులు బి.వి శ్రీనివాసరావు అన్నారు. అంగలూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పూలే జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ 52 పాఠశాలలను స్థాపించి అన్ని కులాలకు చెందిన విద్యార్థుల కూ విద్యనందించించారని చెప్పారు. బి.త్రిపుర సుందరీ దేవి, వి.మంజుల. కౌలు రైతుల సంఘం గౌరవాధ్యక్షులు మామిడి బాబురావు, చిలుముల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. తొలుత ప్రధానోపాధ్యాయ నిరాజ్యం సావిత్రి బాయిపూలే చిత్ర పటానికి పూలమాలను వేశారు.

అవనిగడ్డ....

విశాలాంధ్ర- అవనిగడ్డ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఐక్యూఎసి మహిళా సాధికారితా విభాగము ఆధ్వర్యంలో భారతీయ తొలి మహిళ ఉపాధ్యాయురాలు సంఘసంస్కర్త ,మార్గదర్శి సావిత్రిబాయి పూలే జయంతిని మంగళవారం ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి మాట్లాడుతూ మహిళా లోకానికి స్ఫూర్తి ప్రదాత సావిత్రిబాయి అన్నారు. ఐ క్యు ఎ సి కోఆర్డినేటర్ డా. పి. బి. సంధ్య శ్రీ మాట్లాడుతూ సావిత్రిబాయి తమ జీవితకాలంలో ఎన్నో అవరోధాలను ఎదుర్కొని తన లక్ష్యాన్ని, నమ్మిన సిద్ధాంతాన్ని జీవితకాల పర్యంతము నిలబెట్టుకున్నారని తెలిపారు. మహిళా సాధికారత విభాగం అధిపతి డా కెవి శాంతకుమారి మాట్లాడుతూ సామాజిక సేవలో మహిళా అభ్యున్నతలో సావిత్రిబాయి సేవలు చిరస్మరణీయం అన్నారు. సీనియర్ అధ్యాపకులు కె. సుజాత ను ఘనంగా సన్మానించారు.

పీఆర్టీయూ ...

విశాలాంధ్ర - చల్లపల్లి: స్త్రీవిద్యకు ఆద్యురాలు సావిత్రిభాయి పూలే జయంతి సందర్భంగా పీఆర్టీయూ ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు డి. లలితకుమారి, కృపామణి, డి.భాస్కరరావు, మట్టా రజాకర్లను సన్మానించారు. ఆర్.విజయ్కుమార్, అరుణకుమారి, అంగన్వాడీ కార్యకర్త పద్మ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు రద్దు చేయొద్దు

విశాలాంధ్ర, మచిలీపట్నం: అవ్వ తాతలు అని మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన సీఎం జగన్ పాత పెన్షన్లను రద్దు చేయడాన్ని టీడీపీ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. మంగళవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వైసీపీ నాయకుడు జగన్మోహన్ రెడ్డి పార్టీ అధికారంలోకి రాగానే 3000 పెన్షన్ ఇస్తానని నమ్మ పలికి ప్రస్తుతం అర్హత ఉన్న వాళ్ళకి ఎగనామం పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. పేదప్రజల పెన్షన్లు తొలగించడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెన్షన్ దారులకు ఇచ్చిన నోటీసులు వెంటనే వెనక్కు తీసుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ లంకె నారాయణ ప్రసాద్, పార్టీ అధ్యక్ష కార్యదుర్యులు ఇలియాస్ పాషా, పిప్పల్ల కాంతారావు, మహిళ అధ్యక్షురాలు లంకిసెట్టి నీరజ, రాష్ట్ర సాధికార సుర్యబలిజ కన్వీనర్ రాల్లకొట్టు రాము, కార్పొరేటర్లు సమత కీర్తి, దేవురపల్లి అనిత, అన్నం ఆనంద్, దింటకుర్తి సుధాకర్, బీసీ సెల్ అధ్యక్షుడు గోకుల్ శివ, యువనాయకులు లంకె హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులకు ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు

విశాలాంధ్ర- అవనిగడ్డ : స్థానిక బస్ డిపోలో అన్ని బస్సులకు నాగార్జున నర్సింగ్ హెూమ్-రేపల్లె సౌజన్యంతో ఫస్ట్ ఎయిడ్ కిట్ లను మంగళవారం అందజేసారు. డాక్టర్ వల్లభనేని కృష్ణ చైతన్య తండ్రి వల్లభనేని బుచ్చయ్య చౌదరి ఫస్ట్ ఎయిడ్ మందులను (కిట్) డిపో మేనేజర్ కె. హనుమంతరావు కు అందచేసారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు, సిబ్బంది సౌకర్యార్థం ఈ విధంగా నాగార్జున నర్సింగ్ హెూమ్ మందులను అందజేయటం ఎంతో సంతోషకరమన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఈ రకమైనటువంటి వితరణ ఎంతో ప్రశంసనీయమని డాక్టర్ వల్లభనేని కృష్ణ చైతన్య, ఎం.యస్., బుచ్చయ్య చౌదరిని, ఇతర సభాదర్ వలీ అభినందించారు. సిహెచ్ శ్రీ లక్ష్మీ గారు , అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు , డిప్యూటీ సూపర్నెంట్ పర్సనల్ శ్రీ ధర్ మరియు ఇతర సూపర్వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వో కార్యాలయానికి కంప్యూటర్ బహూకరణ

విశాలాంధ్ర- చల్లపల్లి: మండల పరిధిలోని పురిటిగడ్డ వీఆర్వో కార్యాలయానికి ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ డా.వేములపల్లి సురేష్ మంగళవారం కంప్యూటరు బహూకరించారు. రూ.52వేల విలువైన కంప్యూటర్ను వీఆర్వో పి.కిరణ్కుమారు కు అందచేశారు. ఐవీఎం ప్రతినిధి స్వీతిన్రాస్ పాల్గొన్నారు.

మెకానిక్‌కు ఆర్థికసాయం

విశాలాంధ్ర - చల్లపల్లి: రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న నిరుపేద మెకానిక్ మహమ్మద్ గౌస్కు అవనిగడ్డ శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిషోర్నాయుడు రూ.5 వేల ఆర్థికసాయం చేశారు. మెకానిక్ అసోసియేషన్ నేతలు షేక్ నబీఘోరి, కొల్లూరి ప్రేమ్చంద్, దాస్, షరీఫ్, అన్వర్ భాషు, సురేష్, రబ్బాని, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవాంగ పండిత అర్చక ద్వితీయ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర, పెడన: దేవ బ్రాహ్మణ (దేవాంగ) పండిత అర్చక పురోహిత పరిషత్ ద్వితీయ సర్వసభ్య సమావేశం స్థానిక గూడూరు రోడ్డు బ్రహ్మపురం దేవాంగ కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించబడనని ఆ పరిషత్ అధ్యక్షులు చల్ల రామారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవాంగ పండిత అర్చక పురోహిత పరిషత్ ద్వితీయ సర్వసభ్య సమావేశము నకు ముఖ్య అతిథులుగా శ్రీశైలం శ్రీ ఉమా రామలింగేశ్వర దేవాంగ సత్రం అధ్యక్షులు బొమ్మన దుర్గాప్రసాదరావు ,శ్రీశైలం శ్రీ ఉమా రామలింగేశ్వర దేవాంగ సత్రం ప్రధాన కార్యదర్శి కాలెపు సత్యనారాయణమూర్తి ,శ్రీశైల గాయత్రీ పీఠం వంశీయులు కారుపర్తి నాగలింగమూర్తి, మరియు గౌరవ అతిథులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు డీ.కే నాగరాజు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం కోశాధికారి ఉప్పు కనకరాజు, యొక్క సర్వసభ్య సమావేశానికి విచ్చేయుదురు అని తెలిపారు ఈ సమావేశంలో ముఖ్యంగా మూడు ఎజెండా అంశాలు ఉన్నాయని అన్నారు, సభ్యులందరూ తప్పక హాజరుకావాలని కోరారు.

అర్హులందరికీ పింఛన్లు: జేసీ

విశాలాంధ్ర, మచిలీపట్నం: వృద్ధాప్యం, శారీరక వైకల్యం ఏ ఒక్కరికి భారం కాకుండా ఉండాలన్న భావనతో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం పెద్ద ఎత్తున పెన్షన్లు అందజేస్తున్నట్లు కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నుంచి మంగళవారం పెన్షన్ పెంపు వారోత్సవాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. బందరు కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాల్లో జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, మచిలీపట్నం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ తంటేపూడి కవితా థామస్ నోబుల్, డిఆర్డీఏ పిడి పి ఎస్ ఆర్ ప్రసాద్, లబ్ధిదారులు కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు.

అనంతరం జేసీ మాట్లాడుతూ, కృష్ణాజిల్లాలో ఇంతకు ముందు 1,97,208 మంది లబ్ధిదారులకు రూ.39.54 కోట్లు పెన్షన్ అందిస్తుండగా, కొత్తగా 2023 జనవరి నుంచి మరో 8,622 మందికి పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. అవనిగడ్డ నియోజకవర్గంలో మొత్తం పెన్షన్ల సంఖ్య 43054 కాగా మొత్తం రూ.11,75,00,750 లు మొత్తాన్ని ప్రభుత్వం అందజేస్తుందని అలాగే కొత్తగా 1,286 పెన్షన్లు మంజూరు అయ్యాయిన్నారు. గన్నవరం నియోజకవర్గంలో 30,986 కాగా, రూ. 8,50,69,000 , గుడివాడలో 28,662 కాగా, ప్రతి నెల రూ 7,90,76,000, మచిలీపట్నంలో 30,487 మందికి ప్రతినెల రూ. 8,51,22,750, పామర్రులో 36,513 పెన్షన్లు కాగా, రూ. 9,91,66,750 , పెడన లో 32,515 కాగా, రూ. 8,90,27,750 లు, పెనమలూరులో 36,645 కాగా, రూ.10,11,20,500లు అందజేస్తున్నట్టు వివరించారు. అనంతరం లబ్ధిదారులకు రూ.65.61 కోట్ల చెక్కును జాయింట్ కలెక్టర్, డిప్యూటీ మేయర్, డిఆర్డిఏ పిడి అందజేశారు.

ధాన్యానికి తక్షణమే నగదు జమ చేయాలి

విశాలాంధ్ర - గుడివాడ : ఆర్‌బికే కేంద్రల ద్వార ధాన్యాన్ని కోనుగోలు చేయాలని, కోనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే డబ్బులు జమా చేయాలని జిల్లా రైతు సంఘాల కార్యదర్శులు పంచకర్ల రంగారావు, గౌరిశెట్టి నాగేశ్వరావులు డిమాండ్ చేశారు. మంగళవారం నందివాడ మండలంలోని జోన్నపాడు సెంటర్లు రైతుల అధ్వర్యంలో ధాన్యాన్ని దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌బికే కేంద్రలో రంగమారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కోనుగోలు చేయాలన్నారు. గతంలో కోనుగోలు చేసిన ధాన్యానికి నేటి వరకు డబ్బులు చెల్లించకపోవడం దారుణమన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు సిహెచ్ శ్రీహరి, నీలం మురళీకృష్ణరెడ్డి, వి.శివశంకర్, రైతులు గూడపాటి వెంకటేశ్వరరావు, బి.బాలంకి రెడ్డి, కె.వెంకటస్వామిరెడ్డి, బి.నాగేశ్వరరావు, ఎం.సీతారామయ్య, జి.మురళీ, ఎం.వేదవతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మరింత సేవ చేయాలి

విశాలాంధ్ర - గుడివాడ : ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించేందుకు ఏర్పాటు చేసిన వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు కలిసి పనిచేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. మంగళవారం నందివాడ గ్రామంలోని కొండపల్లి కన్వెన్షన్ ప్రాంగణంలో నందివాడ, గుడివాడ రూరల్ మండలాల సచివాలయ సమన్వయకర్తలు, వాలెంటీరల్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు జడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక, కేడిసిసి బ్యాంక్ చైర్మన్ తలశీల నాగేశ్వరరావు, పరిశీలకుడు ఎస్ఎంఆర్ పెదబాబు ప్రభుత్వ ఆశయాలను తెలియజేశారు. ప్రజానీకానికి మరింత మేలు చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం సచివాలయ సమన్వయకర్తలు, గృహ సారధులను ఏర్పాటు చేసిందన్నారు. ఎంపీపీ పెయ్యల ఆదాం, జడ్పిటిసి కందుల దుర్గాకుమారి, గూడపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చంద్రబాబు సభల్లో మరణాలు

ప్రభుత్వ కుట్రలో భాగమే: రావి



విశాలాంధ్ర - గుడివాడ: తన పాలనా వైఫల్యాల వల్ల ఎంత మంది అమాయకులు ప్రాణాలు పోయినా కనీసం స్పందించని ముఖ్యమంత్రి, ర్యాలీలు సభలు రద్దు చేశాడంటే చంద్రబాబుకు వస్తున్న ప్రజా స్పందనను చూసి ఎంత భయపడుతున్నాడో అర్థమవుతుందనీ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం అయన తన కార్యాలయంలో మాట్లాడుతూ చంద్రబాబు సభలకు వస్తున్న ప్రజాధరణను చూసి ఓర్వలేని అధికార పక్షం, కుట్రపూరితంగానే అమాయకులను చంపేశారన్న అభిప్రాయం బలపడుతుందని విమర్శించారు. రాష్ట్రంలో సభలను రద్దు చేయాడం దారునమన్నారు.

పిన్నమనేని వెంకటేశ్వరరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ బాబ్జి ఖండన

మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జి మాట్లాడుతూ ప్రభుత్వ చర్యలు, మంత్రుల వైఖరి చూస్తుంటే, చంద్రబాబు సభలకు వస్తున్న ప్రజాధరణను చూసి ఓర్వలేక సభలను రద్దు చేసిందన్నారు. కేంద్ర సంస్థలతో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి

విశాలాంధ్ర, పెదపారుపూడి: బయోకల్చర్ వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చునని అడిషనల్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ నాగమల్లేశ్వరి అన్నారు. గుడివాడ డివిజన్లోని గుడివాడ, నందివాడ, పెదపారుపూడి మండలాలలోని వ్యవసాయ సిబ్బంది, రైతులకు మండల కేంద్రమైన పెదపారుపూడి కార్యాలయంలో మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. బయో కల్చర్ వల్ల అన్ని రకాల పంటలకు, కూరగాయలకు వరి, మినుము, పండ్ల తోటలను పురుగులు , తెగుళ్ళ నుండి అరికట్ట వచ్చునని అన్నారు. అలాగే మొక్కల పెరుగుదల, బలముకు ఉపయోగం ఎంతో ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం. వసంతరావు వి. శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.

జగన్‌ను మరోసారి ఆదరించండి

విశాలాంధ్ర- అవనిగడ్డ : గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమ పథకాలు ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ఆదరించాలని శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు కోరారు. అవనిగడ్డ ఎనిమిదో వార్డులో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరుతున్నాయని చెప్పారు. పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా పథకాలను అమలు చేస్తూ దేశంలోనే గొప్ప ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డి పేరు తెచ్చుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా కొంతమంది స్థానికులు ఆక్రమణలకు గురైన రహదారి, స్మశాన వాటిక సమస్యను పరిష్కరించాలని, అంబేద్కర్ సామాజిక భవనం నిర్మించాలని కోరగా అందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సి.బి.సి.ఎన్.సి స్కూల్ కు కరెంట్ బిల్ చెల్లించక పోవడం వల్ల విద్యుత్తు కనెక్షన్ తొలగించిన విషయాన్ని హెచ్ఎం ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఎంఈవోతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ఎంపిడివో శైలజ, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గౌరుమచ్చు ఉమా, వైఎస్ఆర్సిపి నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ బాషా,ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ నలుకుర్తి రమేష్ , ఉప సర్పంచ్ గాజుల జయ గోపాల్ , వైఎస్సార్సీపీ నాయకులు సింహాద్రి రామనాథ బాబు , కొడాలి దయానంద్, చింతలపూడి బాలుతో పాటు పలువురు సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

19వ రోజుకు రిలే దీక్షలు

విశాలాంధ్ర-వీరులపాడు: మండల కేంద్రాన్ని వీరులపాడు లోనే కొనసాగించా లని డిమాండ్ చేస్తూ వీరులపాడు గ్రామస్తులు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు మంగళవారం 19వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో నంద్రు చిన్న రాములు,గద్వాల కృష్ణారావు,అద్దంకి పుల్లారావు,అద్దంకి సుబ్బారావు,నంద్రు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు ఉద్యోగాలు

విశాలాంధ్ర, గన్నవరం: గ్రామీణ యువత ప్రతిభకు అనుగుణంగా వివిధ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించి వారి ఆర్థిక పురోభివృద్ధికి చేయూత అందిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీ తెలిపారు. విజయవాడకు చెందిన స్మార్ట్ టెక్స్ కంపెనీ ఆధ్వర్యంలో గన్నవరం నియోజకవర్గంలో ఎంపిక చేసిన పలువురు యువకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. వారిలో 12 మందికి బై జ్యూస్ సంస్థలో ఉద్యోగాలు కల్పిస్తూ నియామక పత్రాలను మంగళవారం అందజేసినట్లు వివరించారు. ఒక్కొక్కరికి ఏడాదికి 7.5 లక్షలు ప్యాకేజీలో వేతనముగా వస్తుందన్నారు. ప్రస్తుతం ఉద్యోగాలు పొందిన వారు బెంగుళూర్, కర్నూల్, హైదరాబాద్ వంటి నగరాల్లో పనిచేస్తారన్నారు. ఎమ్మెల్యే వంశీకి యువకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ టెక్స్ సీఈవో దివ్య పాల్గొన్నారు.

మహిళా విద్యాప్రదాత సావిత్రిబాయి పూలే

విశాలాంధ్ర - జగ్గయ్యపేట: పట్టణంలోని విజయవాడ రోడ్డు కమలా థియేటర్ సమీపంలో ఉన్న సావిత్రి బాయిపూలే 192వ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్ జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పాటుపడిన మహిళా చైతన్య మూర్తి సావిత్రిబాయి పూలే అని అన్నారు. పట్టణ యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్, వాణిజ్య విభాగం అధ్యక్షులు చారుగుండ్ల కొండ,నాయకులు జంగాల వాసు,కొత్త పురుషోత్తం,శ్రీనివాస్ గౌడ్,విజయ్, సుదర్శన్,పుల్లయ్య,పాటి సాంబ,శ్రీను,తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల నివాళి...

తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ ఇంచార్జి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. కమల సెంటర్ వద్ద గల సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారని పేర్కొన్నారు. మేకా వెంకటేశ్వర్లు,ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, పేరం సైదేశ్వరరావు, ఇద్రి నరసింహారావు, సంగెపు.బుజ్జి గొట్టే నాగరాజు తెదేపా నాయకులు గట్టిడి దుర్గాప్రసాద్, కానూరి కిషోర్, దులిపాళ్ళ లక్ష్మణరావు, దర్శి నరసింహారావు,కొరకూటి సైదులు, గుమ్మా మధు, మల్లెబోయిన.జ్వాలా,పితాని బ్రదర్స్, గజ్జి శివ, గుడారు.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ తొలి ఉపాధ్యాయిని...

విశాలాంధ్ర, గన్నవరం: సావిత్రిబాయి పూలే 192 వ జయంతి దావజిగుడెం బి సి కాలేజీ బాలికల హాస్టల్ లో మంగళవారం నిర్వహించారు. బుద్దవరం సర్పంచ్ బడుగు భాలమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు అన్నవరపు ఎలిజా బెత్ రాణి మాట్లాడుతూ భారతదేశంలో విద్యావేగుచుక్క అని, మొదటి దళిత విద్యార్థులకు పాఠశాల నిర్మించిన గొప్ప ప్రబోధిని,భర్తతో కలిసి మొదటి విధవ వివాహ వేదిక నిర్మించిన సామాజిక విప్లవ కారిణి మహాత్మ పూలే, సావిత్రిబాయి పూలే ఈ ఇరువురూ భారతదేశంలో విద్యా విప్లవానికి బాటలు వేశారన్నారు. కుల మత భేద భావం లేకుండా విద్యను ఒక జ్ఞాన ప్రవంతిగా ప్రవహింపజేసిన మహోజ్వలమైన వ్యక్తి సావిత్రిబాయి పూలే అన్నారు. సావిత్రిబాయి పూలే కు భారతరత్న ఇవ్వాలని జడ్పిటిసి సభ్యులు అన్నవరాపు ఎలిజా బెత్ రాణి అన్నారు. సురెడ్డి మణి మ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంచికచర్లలో...

విశాలాంధ్ర- కంచికచర్ల: సావిత్రిబాయి పూలే 192 వ జయంతి వేడుకలు కంచికచర్ల పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కంచికచర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి సచివాలయం సిబ్బందితో కలిసి వైసిపి నాయకుడు మాజీ ఎంపిటిసి వేల్పుల శ్రీనివాసరావు పూలమాలలు వేసిఘన నివాళులు అర్పించారు. నాగులు మీరా, ఇల్లా సుబ్బారావు, బిల్ కలెక్టర్ గుప్త, కంప్యూటర్ ఆపరేటర్ కోట ఆనంద్, ఎలక్ట్రీషియన్స్ సూదుల శ్రీనివాసరావు, బాలు, శానిటేషన్ మేస్త్రి నాగభూషణం, పంచాయతీ సిబ్బంది, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ అజయ్, డి ఏ వెంకటేశ్వరరావు, వంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.జిల్లా పరిషత్ హైస్కూల్లో జిల్లాపరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు యస్ యస్ ప్రసాద్ ఉపాధ్యాయినులు నిర్మల, సునీల సావిత్రీబాయి చేసిన సేవలను కొనియాడారు. పుల్లారావు, బాబూరావులను శాలువాలు, బొకేలతో సన్మానించారు. స్థానిక అక్షర జూనియర్ కాలేజీలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ కే జాహిత ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మాధవ్, రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలకు సమిష్టి కృషి అవశ్యం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరు సమిష్టి కృషి చేయాలని కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి యు.రామ్మోహన్ అన్నారు. నగరంలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న మొబైల్ కోర్టులో భాగంగా కార్పొరేషన్ కోర్టు న్యాయమూర్తి యు.రామ్మోహన్ మంగళవారం సర్కిల్-1 కార్యాలయంలో మొబైల్ కోర్టును నిర్వహించారు. విజయవాడ నగర వీధుల్లో జనావాసాల్లోకి వస్తున్న పందుల నిర్వాహకులు, పశువుల యజమానులు, ట్రేడ్ లైసెన్సు లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్నవారు, పారిశుధ్య నిబంధనలు అతిక్రమించిన వారిపై నేరం రుజువు కావటంతో వారిపై అపరాధ రుసుం విధించారు. నగర పాలక సంస్థ కమిషనర్ ఆదేశాలు మేరకు సర్కిల్-1లోని శానిటరీ ఇనస్పెక్టర్లు మున్సిపల్ కార్పొరేషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై నమోదు చేసిన 38 కేసులను న్యాయమూర్తి ముందుంచారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై నేరం రుజువు కావటంతో న్యాయమూర్తి వారికి రూ.17 వేల 450 జరిమానా విధించారు. మరొకసారి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించి అనంతరం న్యాయమూర్తి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నియంత్రణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను అమలు చేయాల్సిన భాధ్యత మనందరిపై ఉందన్నారు. విజయవాడ నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇనస్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు కూడా ప్రతిరోజు ఆయా డివిజన్లలో ప్లాస్టిక్ అమ్మే షాపులను తనిఖీ చేసి విధిగా ప్లాస్టిక్ నిషేదం అమలు చేయాల్సిందిగా ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్-1 కేటీ.సుధాకర్, హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ సురేష్ బాబు, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇనస్పెక్టర్లు, శానిటరీ సెక్రెటరీలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజాఉద్యమాలకు సిద్ధం కావాలి

పార్టీ శ్రేణులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ దిశానిర్దేశం
జనవరి చివరినాటికి పార్టీ సభ్యత్వ నమోదు పూర్తి చేయాలి
మండల కేంద్రంగా వీరులపాడునే కొనసాగించాలని తీర్మానం

విశాలాంధ్ర-విజయవాడ: ఎన్టీఆర్ జిలాల్లో ప్రజాసమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉందని, ప్రజాసమస్యలపై ఉద్యమాలకు పార్టీ నాయకత్వం సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. దాసరి భవన్‌లో మంగళవారం నిర్వహించిన సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెన్షన్లు కోల్పోయిన వారిని సమీకరించి ఎక్కడికక్కడ నిరసనల కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు.

జగనన్న ఇళ్లకు రూ.5లక్షలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను లబ్దిదారులకు స్వాధీనపర్చాలనే డిమాండ్‌ను ప్రధాన ఎజెండాగా చేపట్టాలన్నారు. జనవరి 17 నుంచి 30వ తేది వరకు జగనన్న ఇళ్ల లబ్దిదారులను కలిసి అర్జీలపై సంతకాలు సేకరించాలని సూచించారు. ఫిబ్రవరి 6న జిల్లా కేంద్రాల్లో లబ్దిదారులతో సదస్సులు నిర్వహించి కలెక్టర్‌లకు వినతిపత్రాలు అందించాలన్నారు. రైతాంగ సమస్యలపై రైతు సంఘాల ఐక్యవేదిక చేపట్టిన సమైక్య ఉద్యమానికి పార్టీ సహకారం అందించాలన్నారు. ఏపీ ప్రత్యేక హోదా, విభజన చట్ట హామీల అమలు సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 4వ తేది వరకు జరిగే బస్సు యాత్ర జయప్రదానికి జిల్లా పార్టీ సహకరించాలని కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం 23, 24 తేదిలలో జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్‌లలో, 25న కలెక్టరేట్ వద్ద దీక్షలు జరపాలన్నారు. జిల్లాలో బాల సంఘాల నిర్మాణంపై దృష్టిపెట్టాలని సూచించారు. ప్రజాసమస్యలను గుర్తించి పోరాటాలకు సన్నాహాలు చేసుకోవాలన్నారు. దీంతో పాటు జనవరి చివరినాటికి పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ పూర్తి చేయాలని, సభ్యత్వ లిస్టు రాష్ట్ర కేంద్రానికి పంపాలని చెప్పారు. జిల్లాలో కొత్త శాఖల నిర్మాణం చేపట్టాలన్నారు.

సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు మాట్లాడుతూ, భవిష్యత్తు పోరాటాలు, కర్తవ్యాలను వివరించారు. జిల్లాలో వీరులపాడు గ్రామాన్ని వీరులపాడు మండల కేంద్రంగా కొనసాగించాలని కార్యవర్గం తీర్మానం చేసింది. ఈ మేరకు వీరులపాడులో పార్టీ చేపట్టిన ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ముందుగా సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. కార్యవర్గం రెండు నిమిషాలు మౌనం పాటించి ఇటీవల మృతి చెందిన పార్టీ నాయకులకు సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, జల్లివిల్సన్, ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ సెక్రటరీ దోనేపూడి శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు, ఈమని దాము, సీతారావమ్మ పాల్గొన్నారు.

జిల్లాలో కొత్తగా 7,595 మంది

కొత్త పింఛన్‌దారులు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జిల్లాలో 2లక్షల 32వేల 866 మంది పింఛన్ దారులకు రూ.64కోట్ల 60లక్షల 31వేల 250 లబ్ధి చేకూరుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం నుండి మంగళవారం వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాల్లో కలెక్టర్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పలువురు ప్రజా ప్రతినిదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 7,595 మంది కొత్త పింఛన్‌దారులను అర్హులుగా గుర్తించి పెంచిన పెన్షన్‌తో కలిసి అందిస్తున్నామన్నారు. వృద్ధులు, వితంతువులు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులు, సాంప్రదాయ చర్మకారులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, ఏపీసీఆర్‌డీఏ పరిధిలో భూమిలేని నిరుపేదలకు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్స్, కల్లుగీత కార్మికులకు రూ.2,750 అందిస్తున్నామన్నారు. నేటి నుండి పెన్షన్ వారోత్సవాలను నిర్వహించి ప్రభుత్వం పెంచిన పెన్షన్‌ను పెన్షన్లదారులకు వివరించి వారోత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు. ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణువర్ధన్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ పరిధిలోని విజయవాడ తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలు, గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్‌లో కొత్తగా గుర్తించిన 3061 మందితో కలిసి మొత్తం 85,964 మంది పెన్షన్‌దారులకు రూ.24కోట్ల 4లక్షల 92వేల 250 లబ్ధి చేకూరనుందన్నారు. మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, కొండపల్లి అర్బన్, మైలవరం, రెడ్డిగూడెం మండలాల్లో కొత్తగా గుర్తించిన 1118 మందితో కలిపి మొత్తం 35,378 మంది పెన్షన్‌దారులకు రూ.9 కోట్ల 77 లక్షల 73 వేల 750 లబ్ధి చేకూరనున్నదన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట అర్బన్ మండలాల్లో కొత్తగా గుర్తించిన 957 మందితో కలిపి మొత్తం 33,142 మంది పెన్షన్‌దారులకు రూ.9 కోట్ల 16 లక్షల 17 వేల లబ్ది చేకూరనుందన్నారు. నందిగామ నియోజకవర్గంలోని చంద్రర్లపాడు, కంచికచర్ల, నందిగామ, వీరులపాడు, నందిగామ అర్బన్ మండలాల్లో కొత్తగా గుర్తించిన 1156 మందితో కలిపి మొత్తం 41,169 మంది పెన్షన్‌దారులకు రూ.11కోట్ల 35లక్షల 70 వేల 250 పెన్షన్ అందిస్తున్నామన్నారు. తిరువూరు నియోజకవర్గంలోని ఏ కొండూరు, గంపలగూడెం, తిరువూరు, విసన్నపేట, తిరువూరు అర్బన్ మండలాల్లో కొత్తగా గుర్తించిన 1303 మందితో కలిపి 37,213 మంది పెన్షన్‌దారులకు రూ.10కోట్ల 25లక్షల 78 వేలు లబ్ధి చేకూరనుందన్నారు. తొలుత పెన్షన్ పెంచిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లబ్దిదారులు కృతజ్ఞతలు తెలుపుతూ కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్‌బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపశేషు, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ జమల పూర్ణమ్మ, డిప్యూటి మేయర్‌లు బెలం దుర్గ, అవుతు శైలజారెడ్డి, యూసీడీ పీవో శకుంతల, డీఆర్‌డీఏ పీడీ కే.శ్రీనివాస్, పెన్షన్ లబ్దిదారులు పాల్గొన్నారు.

'పింఛన్' పేదలకు భరోసా

విశాలాంధ్ర - మైలవరం : నియోజకవర్గంలో 1652 మంది లబ్దిదారులకు నూతనంగా పింఛన్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ వెల్లడించారు. ఇబ్రహీంపట్నం మండల కార్యాలయంలో మంగళవారం లబ్దిదారులకు పింఛన్, రైస్ కార్డులను అందజేశారు. అనంతరం వసంత మాట్లాడుతూ, పేద ప్రజలకు పింఛన్ భరోసా కల్పిస్తుందన్నారు. పింఛన్ కోసం క్యూలు కట్టి ఎదురుచూపులు చూసే విధానానికి స్వస్తి పలికి తెల్లవారుజాము నుంచే నేరుగా పింఛన్ సొమ్మును ఇళ్లకే వెళ్లి అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో దాదాపు 20వేల మందికి ఇళ్ళపట్టాలు ఇచ్చామన్నారు. ఇబ్రహీంపట్నం, కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో గత ప్రభుత్వంలో 500 మందికి మాత్రమే ఇళ్ళపట్టాలు ఇస్తే, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 3600 మందికి ఇళ్ళపట్టాలు ఇచ్చామన్నారు. పింఛన్లు తీసేస్తున్నారని ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని అన్నారు. ఆయా మున్సిపాలిటీలో 336 మందికి కొత్తగా మంజూరు చేయగా, అనర్హులకు 35 మందికి మాత్రమే పింఛన్లు తొలగించినట్లు వెల్లడించారు. తాజాగా 181 మందికి రైస్ కార్డులను ఇచ్చామన్నారు. అభివృద్ధి పనులకు రూ.50 కోట్ల వరకు మంజూరు చేశామన్నారు. ఇంటింటికీ నీటికుళాయిలకు రూ.55 కోట్లు మంజూరు అయినట్లు వివరించారు.

చీకటి జీవోలతో రాజ్యాంగ హక్కులకు భంగం

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : రాజ్యాంగ హక్కులను తుంగలో తొక్కేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపకులు,హైకోర్టు న్యాయవాది జడ శ్రావణ్ కుమార్ అరోపించారు. మంగళవారం గాంధీనగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అర్ధరాత్రి జీవో లు విడుదల చేయడం జగన్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు.ఇలాంటి చీకటి జీవోలతో ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కే విధంగా ముఖ్యమంత్రి జగన్ వ్యవహరిస్తున్నారన్నారు. సబ్ కలెక్టర్‌ల చేత సినిమా టికెట్స్ అమ్మించిన గొప్ప ముఖ్యమంత్రి జగన్ గతంలో చంద్రబాబు,కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో సజ్జల లాంటి సలహాదారులు లేకపోవడం వల్లనే వారు ఇలాంటి జీవో లు ఇవ్వలేకపోయారేమో అన్నారు. చరిత్రలో జగన్ చెత్త ముఖ్యమంత్రిగా నిలిచిపోతారన్నారు. సభలు,సమావేశాలు నిర్వహించడం ప్రతి రాజకీయ పార్టీ హక్కు . జగన్ ఎవరి అనుమతి తీసుకోని పాదయాత్ర చేశారన్నారు.సభలో తొక్కిసలాట జరిగిందంటే అది పోలీసుల వైఫల్యమే అన్నారు. రాజకీయ సభలకు,సమావేశాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులది కాదా అన్నారు. ప్రజలకు ఒక రాజకీయ పార్టీ చేరువవ్వాలి అంటే రోడ్ షో,సభలు,సమావేశాలు తప్పనిసరి అన్నారు. దశల వారీగా మద్యం నియంత్రణ చేస్తామన్న హామీ ఏమైందన్నారు. గుంటూరులో జరిగిన తొస్సిసలాట జగన్ డ్రామా,అధికారపార్టీ నేతల కనుసన్నల్లో ఉద్దేశ్యపూర్వకంగా తొక్కిసలాట జరిగింది తొక్కిసలాటను సాకుగా చూపించి ఇపుడు ఈ చీకటి జీవో తీసుకు వచ్చిందన్నారు.కీలు బొమ్మల్లా మారిన పోలీసులు మాకు సభలు,సమావేశాలకు అనుమతులు ఇస్తారా అన్నారు. వై.కొండలరావు,పరసా సురేష్ పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగన్

విశాలాంధ్ర, ఎ.కొండూరు : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారని తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిలగడ్డ రక్షణ నిధి పేర్కొన్నారు. మంగళవారం ఎ.కొండూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని కొత్తగా మంజూరైన 260 పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా తన పరిపాలన కొనసాగిస్తున్నారని, కులమత రాజకీయ పార్టీలకతీతంగా అర్హత కలిగి ఉన్న ప్రతి ఒక్క లబ్ధిదారుడికి పెన్షన్లు అందిస్తూ అనారోగ్యంతో ఒంటరిగా ఉంటూ జీవితంలో కష్టాలు ఎదుర్కొంటున్న వారికి ఆర్థిక భరోసా కల్పించారన్నారు. వాలంటీర్ల సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ఇది ప్రజా ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. నవరత్నాల్లో భాగంగా పాదయాత్ర సమయంలో ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా నేడు అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రతి ఏడాది 250 రూపాయలు పెంచుకుంటూ జనవరి 2023 నాటికి రూ 2,750లు లబ్ధిదారులకు అందజేసి మాట నిలబెట్టుకున్నాం న్నారు. నాడు వైయస్ రాజశేఖర్ రెడ్డి సంక్షేమంలో ఒక అడుగు ముందుకు వేస్తే ఆయన కుమారుడు జగన్ రెండు అడుగులు ముందుకు వేస్తూ పేదలందరికీ బాసటగా నిలిచారన్నారు. అవ్వ తాతల అర్హత పెన్షన్ వయస్సు గతంలో 65 ఏళ్లు ఉండేదని, దానిని 60 ఏళ్లకు కుదించి అర్హులైన వారందరికీ అందిస్తున్నారన్నారు. వచ్చే జనవరిలో ఉన్న పింఛన్ ను రూ.3 వేలకు పెంచి అందించడానికి సీఎం సిద్ధమయ్యారన్నారు. 2023 జనవరి 1న కొత్తగా 2,31,463పెన్షన్లు మంజూరు చేశారని దీనికై 64.69 కోట్లు అదనంగా ఖర్చు పెడుతున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-విజయవాడ: ఐసీడీఎస్ ప్రాజెక్టు-1 విజయవాడ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడి సహాయకురాలు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిశు అభివృద్ధి సేవాపథకం అధికారి టి.నాగమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేట-6(బీసీ-డి 48వ డివిజన్), కేఎల్‌రావు నగర్-1(ఎస్సీ, 47వ డివిజన్), వాంబేకాలనీ-2 (బీసీ-డి, 60వ డివిజన్), వాంబేకాలనీ-16(ఓసీ, 60వ డివిజన్), వాంబేకాలనీ-24(ఓసీ, 61వ డివిజన్), కండ్రిక-7(బీసీ-డి, 64వ డివిజన్) మిల్క్ ప్రాజెక్టు-3 (ఓసీ, 46వ డివిజన్). పోస్టులు ఖాళీగా ఉన్న ప్రదేశాలకు సంబంధించిన వివాహితులైన అభ్యర్థినులు మాత్రమే దరఖాస్తు చేయాలని సూచించారు. వివరాలకు 9440814595 సంప్రదించాలని సూచించారు.

జగ్గయ్యపేట పురపాలక సంఘం - ఎన్టీఆర్ జిల్లా,
ఇ-ప్రొక్యూరుమెంట్ టెండర్ నోటిసు

Roc.No.659/1757/1758/1759/1765/1141/E1, Dt:03.01.2023.

జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిదిలో 3 గ్రావెల్ రోడ్డులు, 1 డ్రైన్ నిర్మించుటకు, 40HP మోటార్ రిపేర్ మరియు కంపాక్టర్ & డోజర్ ట్రాక్టర్లకు టైర్లు సప్లై చేయుటకు అన్ని పనులు మొత్తం రూ.28.15 లక్షలకు General Fund నుండి ఇ- ప్రొక్యూరుమెంటు టెండర్లను కోరబడుచున్నవి. కావున సదరు ఇ-ప్రొక్యూరుమెంటు టెండర్లను ది:04.01.2023వ తేది నుండి ది:07.01.2023 తేది వరకు https://tender.apeprocurement.gov.in/ ద్వారా దాఖలు చేసుకోనవలసినదిగా తెలియజేయడమైనది.

-Sd
Commissioner,
Jaggayyapet Municipality.

అన్నిరంగాల్లో ప్రభుత్వం విఫలం: శావల

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: అన్ని రంగాల్లో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం విపక్షాలపై విమర్శలే లక్ష్యంగా కాలం గడుపుతోందని తిరువూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నేత శావల దేవదత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విస్సన్నపేటలో ఆయన తమ పార్టీ నేతలు కార్యకర్తలతో కలసి మంగళవారం విస్సన్నపేటలోని పలు ప్రాంతాల్లో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజాపాలన అంతరించి, ప్రజావ్యతిరేక పాలన రాజ్యమేలుతోందన్నారు. ప్రశ్నించేవారిపై కేసులులు పెడుతూ, దాడులు చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా భయానక వాతావరణం కల్పిస్తున్నట్లు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక సత్తుపల్లి రోడ్డు, కొత్తపేట, ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి, ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మండల నాయకులు మట్టా వేణుగోపాలరావు, నెక్కళపు వెంకటేశ్వరరావు, కోలేటి రంగారావు, సాంబారు నాగలక్ష్మి పాల్గొన్నారు.

తొలి ఉపాధ్యాయురాలు...

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: దేశంలో మహిళలకు విద్యను చేరువ చేసి, మహిళా విద్యకు ఆద్యురాలిగా ఉండటమే కాక, తొలిసారిగా మహిళగా ఉపాధ్యాయ వృత్తి స్వీకరించిన వ్యక్తి సావిత్రీబాయి పూలే అని పలువురు నాయకులు కొనియాడారు. విస్సన్నపేట అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం ఆమె జయంతి సందర్భంగా దళిత బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మహిళా విద్యావ్యాప్తికి చేసిన కృషిని వివరించారు. వేదిక అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి కొండా రాజ్‌కుమార్, సభ్యులు పల్లిపాం లక్ష్మయ్య, ఎస్.సూరిరాజు, పి.ధనరాజు, కె.మోహనరావు, వి.నాగరాజు, ధనమ్మ, గొర్రె లాజరస్, జేటీ.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు జిల్లాల స్థాయి షటిల్ పోటీలు

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో ఐదు జిల్లాల స్థాయి డబుల్స్ షటిల్ టోర్నమెంట్ క్రీడలను ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రశాంత్ మెమోరియల్ ట్రస్టు సభ్యులు తెలిపారు. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో జరిగే ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు విస్సన్నపేటలోని తమ ట్రస్టు సభ్యులను సంప్రదించాలని సూచించారు.

ఐద్వా సభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: ఈనెల 6వ తేదీ నుంచి కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో జరిగే ఐద్వా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వి.నాగరాజు కోరారు. ఐద్వా మండల కార్యదర్శి ధనమ్మ అధ్యక్షతన స్థానిక సుందరయ్యభవనంలో మంగళవారం పతాకావిష్కరణ చేసి, ప్రసంగించారు. మహిళలు దేశవ్యాప్తంగా ఎదుర్కొంటున్న పలు సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టనున్న పోరాటాలపై ఈ సభల్లో ప్రణాళికలు రూపొందించనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో పలువురు ఐద్వా సభ్యులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష ఫీజు అందజేత

విశాలాంధ్ర, విజయవాడ కల్చరల్: షిరిడి సాయి మందిరం(ముత్యాలంపాడు) ప్రతి ఏటా వలె సాయంత్రం మందిర ప్రాంగణంలో మందిరం గౌరవాధ్యక్షులు పి. గౌతంరెడ్డి నగరంలోని ప్రభుత్వ పాఠశాలలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు పరీక్ష ఫీజు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. 13 ప్రభుత్వ పాఠశాలలలో పదవ తరగతి చదువుతున్న 1350 మంది విద్యార్థినీ విద్యార్థులకు లక్ష డెబ్బై వేల రూపాయలు అందించారు. వేదికపై అతిథులుగా నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్,ఎన్ టి ఆర్ జిల్లా విద్యాశాఖాధికారి రేణుక,కార్పొరేటర్లు పెన్మత్స శిరీష సత్యం,వి ఎన్ డి ఎస్ ఎస్(శర్వాణి) మూర్తి తదితరులు పాల్గొన్నారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ మాట్లాడుతూ శ్రద్ధ పట్టుదలతోనే విజయం సాధించగలమని ఆ విధంగా విద్యార్థులు తమ లక్ష్యాన్ని చేరుకోవాలని అన్నారు. విద్యాశాఖాధికారి రేణుక మాట్లాడుతూ విద్యార్థులందరు సాయి సద్గురువు దివ్య కృపతో నగర కీర్తిని ఇనుమడింప చేయాలని అన్నారు. పొన్నలూరి లక్ష్మణరావు, మందిర కమిటీ ఇంచార్జ్ కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్,కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జూదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - జగ్గయ్యపేట: సంక్రాంతి సందర్భంగా జగ్గయ్యపేట పోలీస్ సర్కిల్ పరిధిలో జూదాలను నిర్వహించకుండా తగిన ఆదేశాలు జారీ చేయాలని జగ్గయ్యపేట మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కు జగ్గయ్యపేటకు చెందిన ఎస్. శ్రీనివాస్ రావు ఫిర్యాదు ద్వారా కోరారు. ఫిర్యాదు కాపీలను మీడియాకు విడుదల చేశారు. జగ్గయ్యపేట పోలీస్ సర్కిల్ పరిధిలో 2023 కొత్త సంవత్సరంలో సాంప్రదాయ కోడిపందాల పేరుతో జగ్గయ్యపేట. చిల్లకల్లు .వత్సవాయి. పెనుగంచిప్రోలు. పోలీస్ స్టేషన్ల పరిధిలో యదేచ్ఛగా జూదాలు ఆడించేందుకు కొందరు ఇప్పటికే సన్నాహాలు చేస్తున్నారు. గతంలో ఏపీహైకోర్టు సాంప్రదాయ క్రీడలను మాత్రమే నిర్వహించుకోవాలని, జూదాలు ఆడించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చిందన్నారు.

CHANGE OF NAME

I, **VEERA KANAKA DURGA BHAVANI MASIMUKU** (Old Name), W/o. Ummadi Srinivasa Rao, R/o. # 12-29, Srinivasa Enclave, Near Ramalayam Centre, Enikepadu, Vijayawada, NTR dist. A.P. I, declare that I have changed my name as **UMMADI BHAVANI** (New Name). So, hereafter my name is known and called as **UMMADI BHAVANI** only.

ప్రకటన

నా క్లయింటు అయిన శ్రీమతి పల్లికోన సామ్రాజ్యలక్ష్మి, భర్త. లేటు పిచ్చయ్య, డోర్ నెం.22-9/1, ఫ్లాట్ నెం.302, సాయిపురం కాలనీ, విజయదుర్గ ఆర్.కె.డి. గొల్లపూడి, ఎన్టీఆర్ జిల్లా వారి సంబాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా... నా క్లయింట్ ది.29-12-2022, ఏలూరు రోడ్, విజయ టాకీస్ బస్టాప్ నందు గొల్లపూడి వెళ్ళుటకు బస్సు ఎక్కుచుండగా తన భర్త గారు కొనుగోలు చేసిన రాయనపాడు ఆస్తికి సంబంధించిన ఒరిజనల్ లింక్ రిజిష్టర్డు డాక్యుమెంట్ నెం. 6678/2007, ది.20-11-2007వ బొప్పన చౌదరి (లేటు) గారి కుమారుడు బొప్పన వెంకట నాగకృష్ణ గారు, పెనమలూరు, తులసినగర్ వారు కొనుగోలు చేసిన ఒరిజనల్ దస్తావేజు జారిపోయినవి. కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు దస్తావేజును దిగువ తెలిపిన వాలకి గాని లేదా మా క్లయింటుకు గాని అందజేసిన యెడల తగిన పారితోషకము ఇవ్వగలరు. అట్లు కాకుండా సదరు డాక్యుమెంట్‌పై ఏ విధమైన తనఖాలు గానీ, క్లయింట్‌లు గానీ చేసిన యెడల అవి చెల్లనేరవని ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

ఎం. రామనాథ్, అడ్వకేట్
డోర్ నెం.29-1-21,
శేషాద్రిశాస్త్రి వీధి, గవర్నర్‌పేట,
విజయవాడ - 520002
సెల్: 9440150556

విజయవాడ
ది.03-01-2023

నోటీసు

మహారాజశ్రీ గుంటూరు 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A No:264/2022, I.A No:265/2022, I.A No:266/2022 in O.S.No: 440/2017

పూటుకూరి వెంకట వీరేశ్వరరావు - పిటీషనరు/వాది

మరియు

జూలూరి నాగేశ్వరరావు (డైడ్) వగైరాలు -రెస్పాండెంట్స్/ప్రతివాదులు

టు,
R-4: S. శీతాలక్ష్మి, W/o . సాయి గణేష్,
D/o. లేటు జూలూరి నాగేశ్వరరావు,
R-5: P . హేమమాలిని,W/o. కిషోర్, D/o. లేటు జూలూరి నాగేశ్వరరావు, ఇరువురి నివాసం: డోర్ నెం: 11-25-338, C/o. నవభారత్ ఎలక్ట్రికల్స్, సామారంగన్ చౌక్, విజయవాడ.

ఈ దావాలోని వాది జూలూరి నాగేశ్వరావు గారిపై దావా షెడ్యూల్ దాఖలా ఆస్తిని పార్టీషన్ చేయమని కోరుచూ దావా దాఖలు చేయగా ప్రతివాది అయిన నాగేశ్వరావు గారు చనిపోగా వారి వారసులను దావాలో ప్రతివాదులుగా చేర్పించమని దాఖలు చేసిన పిటీషన్ IA No:266/2022 మరియు Order 22 Rule 9 Abatement set aside పిటీషను I.A No: 265/2022, మరియు Sec-5, Limitation Act పిటీషను దాఖలు చేయుటలో జరిగిన అలస్యమును క్షమించమని I.A No:264/2022 పిటీషన్లు దాఖలు చేయగా సదరు పిటీషనులలో రెస్పాండెంట్లు అయినపై తెలిపిన వారికి నోటీసు నిమిత్తం ది:18-01-2023 వ తేదీకి వాయిదా ఉన్నది. కనుక మీకు గల అక్షేపణలను సదురు తేదీ ఉదయం 10:30 కు పై కోర్టు వారి యెదుట హాజరై తెలియజేసుకోవలెను.

వాయిదా తేది: 18-01-2023

T. మురళీధర్, పిటీషనర్/వాది తరఫు అడ్వకేట్, నగరంపాలెం, గుంటూరు, సెల్:9849519808

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

విశాలాంధ్ర - పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు గ్రామంలోని తిరుపతమ్మ దేవస్థానం వంద నాయి బ్రాహ్మణ కళ్యాణ కట్టవద్ద మంగళవారం మహాత్మ జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రి పూలే జయంతి వేడుకలు బీసీ సంక్షేమ సంఘంరాష్ట్ర కార్యదర్శి కొల్లి పాక. బ్రాహ్మం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పూసల బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం మహిళా వెల్ఫేర్ ఉమెన్స్ జాయింట్ సెక్రెటరీ చేని కుమారి రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కల్లూరు శ్రీవాణి రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శి రాష్ట్ర పూసల సంఘం ప్రధాన కార్యదర్శి చేని రాంబాబు కె.వి.ఆర్ జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ చైర్మన్ బాత్తుల వెంకట నర్సు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే బిసి కులాలను బయటకు తీసుకొచ్చిన ఏకైక వ్యక్తి మహాత్మ జ్యోతిరావు పూలే వారి బాటలోనే ముందడుగు వేస్తూ వారి సతీమణి మహాత్మ సావిత్రి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం మనకు ఎంతో ఆదర్శప్రాయం అని అన్నారు ఆమె ప్రపంచంలోనే మహిళలకి చదువు నేర్పించడంలో ఎంతో అనుకో వహిస్తూ మహిళల పట్ల విద్యను ముందుకు నడిపించిన అనగారని జాతి అనగా తొక్కకూడదు అనే భావాన్ని ముందుకు తీసుకువెళ్లిన స్త్రీ అంటే అల్లి కాదు అది పరాశక్తి అని ప్రతి స్త్రీ అందరికి ఆదర్శంగా నిలబడాలని విద్యారంగంలో విద్యార్థులను భావితరాలకు మంచి మాట వేయాలని బోధించిన ఏకైక వ్యక్తి సావిత్రి పూలే అని అన్నారు అనంతరం ఈ రోజున సావిత్రి పూలే బోధించిన ఉపాధ్యాయురాలుగా కావున విద్యావంతురాలు కాబట్టే ఆమెను ఉంచుకొని పెనుగంచిప్రోలు గ్రామంలో కె.వి.ఆర్ జడ్పీహెచ్ఎస్ స్కూల్ హెచ్ఎం జలజ నీ సాలువాతో ఘనంగా సత్కరించారు. ఆమెలాగా విద్యాబోధాన్ని విద్యార్థిని విద్యార్థులకు అందించాలని ఆమె ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కందిముళ్ళ హనుమంతరావు నాయి బ్రాహ్మణ జేఏసీ నాయకులు ఏలూరు శ్రీను ఏలూరు కృష్ణ నాయి బ్రాహ్మణ కళ్యాణ్ కట్ట మాజీ అధ్యక్షులు ఏలూరు గోపి కొలిపాక నాగేశ్వరరావుకొల్లి పాక. కృష్ణ శ్రీనివాసరావు మాజీ దేవస్థానం డైరెక్టర్ ఓర్స్ కొండలు పెనుగంచిప్రోలు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణ ఆదిమూల ఏడుకొండలు కొలిపాక ప్రభాకర్ కొలిపాక శ్రీనివాసరావు కందిమల్ల నాగమణి పోన్నం ఉపేంద్ర త్రివేణి ఎడ్ల లీల గంగరాజు కె.వి.ఆర్ జెడ్ పి హెచ్ ఎస్ స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని సావిత్రి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

నేటి మహిళలకు ఆదర్శం

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : మహిళలను విద్యావంతులైనప్పుడే సమాజంలో మార్పు తీసుకురాగలుగుతామనే లక్ష్యంతో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా భాధ్యతలు చేపట్టి మహిళలను చైతన్యవంతులుగా చేసిన కీర్తిశేషురాలు సావిత్రిబాయి పూలే నేటి మహిళలకు ఆదర్శపాయంగా నిలుస్తారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్ పర్సన్ బడిగించల విజయలక్ష్మి అన్నారు. సావిత్రిబాయి పూలే 192వ జయంతిని పురస్కరించుకుని విజయవాడ గాంధీనగర్‌లోని లేపాక్షి ప్రధాన కార్యాలయంలో ఏపిహెచ్‌డిసి చైర్మన్ వి. విజయలక్ష్మి, యండి బాలసుబ్రమణ్యంతో కలిసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల బాలికల కోసం పాఠశాలలను ప్రారంభించి తొలి మహిళా గురువు అయ్యారు.బాలికల చదువు కోసం విద్యాభివృద్ధి కోసం పలు హక్కుల కోసం పోరాటం చేశారన్నారు.తను ఎంచుకున్న బాటలో ఎన్ని అవమానాలు ఎదురైన మడమతిప్పని ధీశాలి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. మానవ హక్కులు, సామాజిక సమస్యలు, స్త్రీల సాధికారిత కోసం ఆమె చేసిన కృషి చిరస్మరనీయమన్నారు. దేశంలో తీవ్ర దుర్భిక్షం ఏర్పాడినప్పుడు సావిత్రిబాయి పూలే దంపతులు చేసిన కృషి అనన్య సామాన్యం కరువు వాతపడిన కుటుంబాలకు చెందిన దాదాపు 2 వేల మందిని హక్కున చేర్చుకుని తన పాఠశాలలో మధ్యాహ్నం భోజనం అందించి ఆదుకున్న మహోన్నత వ్యక్తుత్వం గల సావిత్రిబాయి పూలేను నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.సావిత్రి బాయి పూలేకు నివాళులు అర్పించిన వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం, ఓఎస్‌డి లక్ష్మినాథ్, మేనేజర్లు ఎస్. శ్రీధరచారి, యం.సురేష్, సిహెచ్ ఎస్ నరసింహారావు, పి.వాసుదేవరావ్, సిబ్బంది పి. ఉమా మహేశ్వరరావు, భారతి, సుధ, కిశోర్, రాజు, పవన్, చంద్రశేఖర్, రాజేష్, నరేష్, శ్యామల, మురళిబాబు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా రాజకుమార్

విశాలాంధ్ర, గంపలగూడెం: గంపలగూడెం మండల డిప్యూటీ తాసిల్దార్ (డిటి) గా మంగళవారం నాడు యు రాజకుమార్ రెవెన్యూ శాఖ డిప్యూటీ తాసిల్దార్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈయన రీ సర్వే స్పెషలాఫీ సర్ గా వచ్చారు.

ఉపాధి హామీ సోషల్ ఆడిట్



విశాలాంధ్ర, గంపలగూడెం: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పై సోషల్ ఆడిట్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలలో నిర్వహించిన ఉపాధి హామీ పథకం పనులపై సమగ్ర నివేదిక లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జె. సునీత ,ఎన్టీఆర్ జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ విజయలక్ష్మి ,అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ మున్ని, ఎంపీడీవో ఎర్రమల. పిచ్చిరెడ్డి ,సిట్ రిసోర్ పర్సన్ నాగేశ్వరావు, అసిస్టెంట్ ఆఫీసర్ రాణా, ఏపీవో వి, వెంకటేశ్వరరావు, మండలం లోని వివిధ గ్రామాల ఫీల్డ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

ముష్టికుంట్లలో అంతర్ రాష్ట్ర క్రీడా పోటీలు

విశాలాంధ్ర-తిరువూరు: మండలంలోని ముష్టికుంటలో ఈనెల 6,7,8 తేదీలలో అంతర్రాష్ట్ర బాల్ బ్యాట్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంజనేయ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గద్దె వెంకటేశ్వరరావు, అంజయ్య తెలిపారు. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల పరిధిలో జరిగే ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.30 వేలు, 25 వేలు, 20 వేలు అందజేస్తామని తెలిపారు. ఎంట్రీలు పంపదలచినవారు. 9505588575, 79812 54517 నెంబర్లు సంప్రదించాలని కోరారు.

బిక్కవోలులో గతి శక్తి కార్గో టెర్మినల్ నిర్మాణం!

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : విజయవాడ డివిజన్ అభివృద్ధి కోసం ఎస్సీఆర్ లో మొట్టమొదటి సారిగా రైల్వే భూమిలో ప్రైవేట్ కాంట్రాక్టు ఈ టెండర్ ద్వారా సరుకు రవాణా టెర్మినల్ నిర్మాణం చేయటానికి అనుమతి పొందారు.బిక్కవోలులోని రైల్వే భూమిలో పూర్తిగా కొత్త గతి శక్తి కార్గో టెర్మినల్ (జిసిటి) అభివృద్ధి కోసం విజయవాడ డివిజన్ ఇ-టెండర్ ద్వారా మొట్టమొదటి కాంట్రాక్టును పొందింది. కాంట్రాక్ట్‌ను గ్రాసిమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు రూ.15.24 కోట్లు నిర్మాణ వ్యయం మొత్తం ప్రైవేట్ సంస్థ భరించాలి.బిక్కవోలులో నిరుపయోగంగా ఉన్న రైల్వే మిగులు భూమిని గుర్తించి లబ్ధి పొందటానికి ఈ చర్యలు చేపట్టారు. రైలు సరుకును నిర్వహించడానికి అదనపు టెర్మినల్స్ అభివృద్ధి చేస్తే ట్రాఫిక్‌తో పాటు డివిజన్‌కు అదనపు ఆదాయాన్ని అందిస్తుంది. బిక్కవోలులోని జిసిటి అనేది ఒక సాధారణ వినియోగదారు సౌకర్యంగా ఉంటుంది ఇందులో సంభావ్య కస్టమర్‌లు/రైలు కస్టమర్‌లు అందరూ తమ వస్తువులను ఎలాంటి వివక్ష లేకుండా రవాణా చేయడానికి జిసిటి ని యాక్సెస్ చేయవచ్చు.కార్గో టెర్మినల్ పూర్తయిన తర్వాత 35 సంవత్సరాల పాటు టెర్మినల్ ఛార్జీలు,యాక్సెస్ ఛార్జీలలో రైల్వేలు 15% ఆదాయ వాటాను కలిగి ఉంటాయి. గ్రాసిమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కాస్టిక్ సోడా లై, ఫుడ్ గ్రెయిన్స్, ఇండస్ట్రియల్ సాల్ట్,జనరల్ మర్చనైజ్, కమీషన్ తర్వాత ట్రాఫిక్‌ను నిర్వహిస్తుంది. ట్రాఫిక్ అంచనాలు నెలకు 12 రేక్‌ల కంటే ఎక్కువ ఉంటుంది.గ్రాసిమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ బిక్కవోలులో జిసిటి నిర్మాణాన్ని హెడ్ క్వార్టర్స్ నుండి అనుమతి పొందిన 18 నెలల్లోపు ప్రారంభించాలి. రైల్వే భూమిలో సృష్టించబడిన ట్రాక్, సిగ్నలింగ్ పరికరాలు ,ఒ.హెచ్‌ఈ సహా మౌలిక సదుపాయాల యాజమాన్యం రైల్వేకు చెందుతుంది. టెర్మినల్ వద్ద నిర్వహించబడే రేక్‌ల కోసం టెర్మినల్ ఛార్జీలు,యాక్సెస్ ఛార్జీలలో జిసిటి ఆపరేటర్ 85 శాతం రాబడి వాటాను పొందుతుంది.

అభివృద్ధి చేయబడిన అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో అదనపు కార్గో టెర్మినల్‌తో రైల్వే ప్రయోజనం పొందుతుంది కాబట్టి ఇది రైల్వేలు,కస్టమర్‌లకు అనుకూలమైంది. ఆపరేటర్. ట్రాక్, సిగ్నల్,టెలికాం, ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ వంటి ఆస్తుల నిర్వహణ,కార్యకలాపాలను టెర్మినల్ వద్ద రైల్వే భరిస్తుంది. అంతే కాకుండా జిసిటిఒ స్వయంగా రవాణాదారులపై కార్గోపై ఎటువంటి టెర్మినల్ ఛార్జీలు విధించబడవు.రైలు కార్గోలను నిర్వహించడానికి అదనపు టెర్మినల్స్ అభివృద్ధిలో పరిశ్రమ నుండి పెట్టుబడులను పెంచే ఉద్దేశ్యంతో భారతీయ రైల్వేలు కొత్త గతి-శక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్ (జిసిటి) విధానాన్ని ప్రవేశపెట్టింది.ఈ విధానం ప్రకారం, కొత్త సైడింగ్‌లు కాకుండా,ఇప్పటికే ఉన్న ప్రైవేట్ సైడింగ్‌లు/టెర్మినల్‌లు కూడా గతి-శక్తి మల్టీ మోడల్ కార్గో టెర్మినల్‌గా మార్చడానికి మారవచ్చు.ఈ సందర్భంగా సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు మాట్లాడుతూ డివిజన్‌లో ఈ టెర్మినల్స్ సురక్షితమైన రవాణాను అందించే మెరుగైన సౌకర్యాలతో రైలు ద్వారా రవాణా కోసం సరుకు రవాణా వస్తువుల నిర్వహణను సులభతరం చేస్తాయన్నారు. ఫీల్డ్ సర్వే, డ్రాయింగ్‌లు సిద్ధం చేయడం, బిడ్ డాక్యుమెంట్‌లు సిద్ధం చేయడం వంటివి కేవలం 4-5 నెలల వ్యవధిలో బిడ్‌లను ఖరారు చేయడంతో సహా అన్ని విభాగాలతో సమన్వయం చేయడం ద్వారా ఫీల్డ్ వర్క్ జరిగిందని పేర్కొన్నారు. అయితే బిక్కవోలు వద్ద ఉన్న ఈ జిసిటి అనేది వినియోగదారుడు భరించే మూలధనంతో పూర్తిగా రైల్వేల్యాండ్‌లో నిర్మించబడిన గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్ట్ అన్నారు.డిఆర్ఎం శివేంద్ర మోహన్ మాట్లాడుతూ డివిజన్‌లో రైల్వే స్థలాలలో జిసిటిలు ద్వారా మరిన్ని అభివృద్ధి చేయటానికి అవకాశం కలుగుతుందన్నారు.

12.160 మిలియన్ టన్నుల సరుకు రవాణా

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : గత డిసెంబర్ నెలలో దక్షిణ మధ్య రైల్వే 12.160 మిలియన్ టన్నుల వస్తువుల సరుకు రవాణా చేసి గత సంవత్సరం డిసెంబర్ నెలతో పోల్చితే 21 శాతం మేర వృద్ధిని నమోదు చేసి భారతీయ రైల్వేలోని అన్ని జోన్లలో అత్యుత్తమమైన రికార్డు సాధించింది.గత ఏడాది ఏప్రిల్-డిసెంబర్ వరకు సరుకు రవాణా విభాగంలో మొత్తం 96.384 మిలియన్ టన్నులు దాటింది. ఇది గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలి స్తే 13 శాతం ఎక్కువ జోన్‌లో ఒక్క డిసెంబర్ మాసంలోనే 12.160 మిలియన్ టన్నుల సరుకును లోడ్ చేసింది.గత ఏడాది తో పోల్చితే ఈ మాసంలో 21శాతం వృద్ధిని నమోదు చేసింది. అదేవిదంగా ఎస్సీ రైల్వే డిసెంబర్ 20లో భారతీయ రైల్వేలోని అన్ని జోన్ లలో జరిగిన లోడింగ్ తో పోల్చితే ఇదే అత్యధిక వృద్ధి సరుకు రవాణాలో వ్యాపారాన్ని ఆకర్షించడానికి ఎస్సీ రైల్వే అధికారులు చేసిన అలుపెరుగని ప్రయత్నాలు వల్ల. అలాగే, సరుకు రవాణా రైళ్ల నిర్వహణలో నిరంతర పర్యవేక్షణ ఫలితంగా జోన్‌లో, అధిక సరుకు రవాణాను సాధించడంలో సహాయపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 2022 డిసెంబర్ 2022లో దక్షిణ మధ్య రైల్వే 96.364 మిలియన్ టన్నుల సరుకును లోడ్ చేసింది. ఇది గత సంవత్సరం ఇదే నెలతో పోల్చితే 13 శాతం అధికం.సరకు రవాణా విభాగంలో వృద్ధి పుంజుకోవడం జరిగింది. ఇది గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే డిసెంబర్ 2022 నెలలో అన్ని వస్తువులు అధిక లోడింగ్ స్థాయిలను సాధించాయి. సరుకు రవాణా వినియోగదారుల నుండి డిమాండ్ను నిరంతరం పర్యవేక్షించడం, తద్వారా సకాలంలో వ్యాగన్ల సరఫరాను అందించడం జరిగింది. డిసెంబర్ 2022 నెలలో రోజుకు సరఫరా చేయబడిన వ్యాగన్ల సగటు సంఖ్య 6041 వ్యాగన్లు, ఇది డిసెంబర్ 2021 (4982 వ్యాగన్లు) తో పోల్చితే వృద్ధి 21 శాతం అధికం.డిసెంబర్ 2022 నెలలో సరుకు రవాణా సరుకుల వారీగా లోడ్ చేయబడిన వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:బొగ్గు-6.198 మిలియన్ టన్నులు(డిసెంబర్ 21లో 4815 మిలియన్ టన్నులు), ఇనుప ఖనిజం 0.133 మిలియన్ టన్నులు (డిసెంబర్ 31లో 0.0 మిలియన్ టన్నులు), సిమెంట్ 3.065 మిలియన్ టన్నులు (డిసెంబర్ 21లో 2.752 మిలియన్ టన్నులు), ఎరువులు 0.745 మిలియన్ టన్నులు (డిసెంబర్ 21లో 0.604 మిలియన్ టన్నులు), అదేవిధంగా, ఆహార ధాన్యాలు, పెట్రోలియం ఉత్పత్తులు. కంటైనర్లు మొదలైన ఇతర వస్తువుల సరుకు రవాణా మొత్తం కలిపి 2019 మిలియన్ టన్నులుగా ఉంది. వీటన్నింటి ఫలితంగా 2021 డిసెంబర్ లో 10.099 మిలియన్ టన్నులతో పోలిస్తే 2022 డిసెంబర్ జోన్ యొక్క మొత్తం సరుకు రవాణా 21 శాతం మేర వృద్ధి సాధించింది.ఈ అత్యున్నతమైన పనితీరును కనపర్చినందుకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ జోనల్,డివిజనల్ స్థాయిలోని ఆపరేటింగ్ మరియు కమర్షియల్ విభాగం అధికారులు, సిబ్బందిని అభినందించారు.

అధికారం కోసం ప్రాణాలతో చెలగాటం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-తిరువూరు: అధికార దాహంతో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాడని తిరువూరు ఎమ్మెల్యే రక్షనిధి విమర్శించారు. మంగళవారం తిరువూరు మండల పరిషత్, నగర పంచాయతీ కార్యాలయాల్లో నూతనంగా మంజూరైన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పేదల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన కార్యక్రమాలకు చంద్రబాబు మోకాలడ్డుతున్నారని, అడ్డదారిలో అధికారం చేపట్టాలన్న తాపత్రయంతో చంద్రబాబు చేసే విన్యాసాలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతు మహిళలకు పెన్షన్లు పెంపుకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి ఈ నెల నుంచి రూ.2750 చొప్పున పెంచారని ఎమ్మెల్యే చెప్పారు.

ఈ కార్యక్రమంలో తిరువూరు ఏఎంసీ చైర్మన్ శీలం నాగ నర్సిరెడ్డి, జడ్పిటిసి సభ్యుడు యరమల రామచంద్ర రెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, వైస్ ఎంపీపీలు రాధాకృష్ణ వెంకట నరసమ్మ, నగర పంచాయతీ చైర్పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్ పర్సన్లు వెలుగోటి విజయలక్ష్మి గుమ్మ కోటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకట రెడ్డి, పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాదు, కాకర్లమూడి సుందర్ కుమార్, మూడు దుర్గారావు, ఎ

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

విశాలాంధ్ర-విజయవాడ(క్రైమ్): రోడ్డు ప్రమాదంలో మామిడి తోట కాపలదారి భార్య దుర్మరణం చెందింది. ఈ ఘటన విజయవాడ పాయకాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాపట్ల గణపవరంకు చెందిన సుబ్బులు(55), భర్త మహాలక్ష్మీ వికాస్ కాలేజీ రోడ్డు చినకంచి సమీపంలో మామిడి తోటలో కాపలదారులుగా పనిచేస్తున్నారు. సరుకులు కొనుగోలు కోసం నున్న గ్రామానికి వచ్చి తిరిగి వెళ్లే సమయంలో చినకంచి సమీపంలో రోడ్డు ప్రమాదంలో టిప్పర్ టైర్ కిందకు వచ్చి సుబ్బులు అక్కడిక్కడే మృతి చెందింది. భర్త స్వల్పగాయాలైయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంబంధం లేదని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు వికాస్‌నగర్‌లో చోటుచేసుకున్న ఘటన చంద్రబా బుకు సంబంధం లేదని నిరూపిస్తే మంత్రి పదవికి, శాసన సభ్యత్వానికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటానని సాంఘిక, సంక్షేమశాఖా మంత్రి మేరుగ నాగార్జున సవాల్ విసిరారు. గుం టూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లోని సుశ్రుత హాలులో మంగళవారం వికాస్‌నగర్‌లో జరిగిన కానుకల పంపిణీలో గాయ పడిన బాధితు లను, కుటుంబ సభ్యులను మంత్రులు మేరుగ నాగా ర్జున, అంబటి రాంబాబు, విడదల రజని, ప్రభుత్వ విప్ డొక్కా మాణిక్యవర ప్రసాద్, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.50వేలు చెక్‌లను అందజే శారు. అనంతరం మేరుగ నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబు అబద్దపు ప్రచారాలు, మోసపూరిత రాజ కీయాలు చేస్తున్నారని ఆరోపించారు. గుంటూరులో జరిగిన సభకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రవణ్ కుమార్ అనుమతి తీసుకున్నారని, సభలో దుప్పట్లు, కందిపప్పులు పంచి పెట్టి పేదల ప్రాణాలను తీస్తారా అని ప్రశ్నించారు. పేదలు చనిపోవడానికి ప్రేరేపించే విధంగా చంద్ర బాబు చేశారని, దీన్ని సుమోటాగా తీసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో గుంటూరులో జరిగిన సంఘటన దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. రాష్ట్రంలో బహిరంగ సభలు పెట్టి ప్రజలను బలి చేయవద్దని, ఇలాంటి ఘటనలో టీడీపీ కార్యకర్తలు చనిపోయిన అమాయక ప్రజలు పట్ల వైసీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. విడదల రజని మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రచార యావతో ప్రజలను మభ్యపెట్టి సభకు తరలించి ముగ్గురి ప్రాణాలను బలి తీసుకున్నాడని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, వికాస్ నగర్ ఘటనలో ముగ్గురు చనిపోగా 19 మందికి పైగా గాయపడ్డా రన్నారు. మృతుల కుటుంబానికి రూ.2లక్షలు, గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందచేసినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, డిప్యూటీ మేయర్ షేక్.సజీల, జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, వైసీపీ కేంద్ర మండలి సభ్యులు తాడిశెట్టి మురళీ మోహన్, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, వైసీపీ నేతలు గులాం రసూల్, పచ్చల ఆనంద్ పాల్గొన్నారు.

సాహితీ పోరాట యోధుడు కవిరాజు త్రిపురనేని

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జాషువా పూలే పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేటలోని సీపీఎం హాలులో ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5గంటలకు కవిరాజు త్రిపు రనేని రామ స్వామి చౌదరి పురస్కార సభ జరుగుతుందని విరసం సీనియర్ నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు స్థానిక బ్రాడీపేట 4వ లైనులోని మద్రాస్ కాఫీ వద్ద పురస్కారానికి సంబంధించిన ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ సాహితీ పోరాట యోధుడు కవిరాజు త్రిపు రనేని రామస్వామి చౌదరి అని అన్నారు. కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కా రాలు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు, పరివర్తన పత్రిక సంపాదకులు కొరివి వినయ్‌కుమార్, అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ, కవి, కథకుడు, సాహితీ విమర్శకుడు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్‌లకు ఇవ్వనున్నట్లు చెప్పారు. 'రామస్వామి చౌదరి సమకా లీనత' అనే అంశంపై వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, పూర్వహక్కుల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్‌లు మాట్లాడనున్నట్లు ఆయన చెప్పారు.

పెద్దాపురంలో "ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి"

విశాలాంధ్ర-వీరులపాడు: అసమర్థుడి పరిపాలనలో రాష్ట్రం అని రంగాల్లో వెనకబడి పోయిందని వీరులపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొండగుంట శ్రీనివాస్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న సభలను చూసి వైకాపాకు వణుకు పుడుతుందని, సభను అడ్డుకోవడానికి రకరకాల కుట్రలు పొందుతుందని విమర్శించారు. అభివృద్ధిని విస్మరించిన వైకాపా రాష్ట్రాన్ని తీవ్ర అంధకారంలోకి నెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బలుసుపాటి బాబురావు,నాయకులు దాములూరి మధుసూదనరావు, చీదిరాల భారత్ రెడ్డి, పసుపులేటి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు

సీఎంగా చంద్రబాబే రావాలి: వర్ల

విశాలాంధ్ర, పమిడిముక్కల: భావితరాల అభివృద్ధికి రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు రావాలని దీనికి మనమందరం ఐక్యతతో ఓటు వేయాలని పామర్రు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా అన్నారు. మంగళవారం కృష్ణాపురం గ్రామంలో వర్ల కుమార రాజా ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రములో అరాచక పాలన నడుస్తోందని ఏ వక్కరికి వైసీపీపై మంచి అభిప్రాయం లేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో జక్కా శ్రీనివాసరావు ఎంవి సుబ్బయ్య రాజులపాటి శ్రీనివాసరావు యార్లగడ్డ రామ గోపాలరావు ఎల్ బాబురావు ఇ. వెంకటేశ్వరరావు బోలం లక్ష్మీనారాయణ పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌టియు సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర- కంచికచర్ల: ఎస్ టి యు కంచికచర్ల మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు మండలంలోని గొట్టుముక్కల,కంచికచర్ల, పరిటాల, గని ఆత్కూరు, కొత్తపేట చెవిటికల్లు గ్రామాల్లో సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా అధ్యక్షుడు బిక్షమయ్య మాట్లాడుతూ ప్రతినెల ఒకటో తారీకు లోగా ఉపాధ్యాయులకు జీతాలు అందజేయాలని పెండింగ్ లో ఉన్న డీఏలను చెల్లించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నగేష్ శ్రీనివాస్ రవికుమార్ మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు

జగన్ పాలనలో ప్రజల జీవనం అస్తవ్యస్థం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఒక్క ఛాన్స్ అంటూ గద్దెనెక్కిన జగన్ మోహన్ రెడ్డి పాలనలో పేద, మధ్య తరగతి ప్రజల జీవనం అస్తవ్యస్తంగా ఉందని క్లస్టర్ ఇన్‌ఛార్జ్ సుకాశి కిరణ్ అన్నారు. ఏపీ కేశినేని నాని సూచనలతో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం మంగళవారం విజయవాడ నెహ్రూబోమ్మ సెంటర్‌లో జరిగింది. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి విధానాలతో నిర్మాణ రంగం పూర్తిగా కుదేలై రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాళా తీసిందన్నారు. నిర్మాణ రంగం పై జీవించే కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో పేదలు జీవించలేని పరిస్థితి ఏర్పడిందని రాష్ట్రానికి ఈఖర్మ ఎప్పుడు పోతుందని ఎదురు చూస్తున్నారని తెలియజేశారు. రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్, రాష్ట్ర నగరాల సాధికార సమితి అధ్యక్షులు మరుపిళ్ళ తిరుమలేష్, జిల్లా కార్యాలయ సారిపల్లి రాధాకృష్ణ, మైనారిటీ నాయకులు ఎంఎస్ బేగ్, మాజీ కార్పొరేటర్ సుకాశి సరితలు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పాలనలో నిర్మించిన ఇల్లులను నిరూపయోగంగా ఉంచారని, ఆవి పేదలకు అందజేస్తే అద్దె భారాలు తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమం డివిజన్ పార్టీ అధ్యక్షులు ఈది నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వేపాడ యర్రారెడ్డి, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు సారేపల్లి దుర్గారావు, బెవర రవికుమార్ నేతృత్వంలో చేపట్టారు.

దుర్గమ్మ సన్నిధిలో అపచారం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ ఇంద్రకీలాద్రి పై కొలువైన కనకదుర్గమ్మ సన్నిధిలో తీవ్ర అపచారం జరిగింది. ఎన్నడూ లేనివిధంగా గర్భగుడిలో అమ్మవారి మూలవిరాట్ వీడియోలు తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రత్యక్షం కావడం కలకలం సృష్టించింది. దీని పై ఆలయ అధికారులు విజయవాడ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తి మూలవిరాట్ వీడియోలు తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడంతో ఈఘటన వెలుగులోకి వచ్చింది. అమ్మవారి సన్నిధిలో ఫోన్లకు అనుమతి లేదు. అయినా గుర్తుతెలియని వ్యక్తి వీడియో తీసి పోస్ట్ చేయడంతో భక్తుల తీవ్ర ఆవేదన చెందారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

న్యూడీల్స్ తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం

విశాలాంధ్ర-విజయవాడ(క్రైమ్): నూడీల్స్ తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈఘటన విజయవాడ సూర్యారావు పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దుర్గాపురం సాంబమూర్తిరోడ్డులో నూడీల్స్ తయారీ కేంద్రంలో పొయ్యి ఆర్పకుండా నిర్వాహకులు వెళ్లిపోవడంతో అగ్నిప్రమాదం జరిగింది. రేకుల షెడ్డు ఆరు గదులు ఉండగా, మూడు గదుల్లో సామాగ్రి పూర్తిగా కాలిపోయాయి. సమాచారం అందుకున్న సూర్యారావుపేట పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సూర్యారావు పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.